క్లుప్తంగా

ఉపాధి పనులపై ఎంపీడీవో సమీక్ష

నూజెండ్ల: ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో ఒక్కో ఫీల్డ్ అసిస్టెంట్ 15 వ్యవసాయ నీటి కుంటలను తీయించే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో పావులూరి ఉమాదేవి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలో ఉపాధి పనులను వేగవంతం చేసి అధిక సంఖ్యలో జాబ్‌కార్డులు కల్గియున్న వారందరికీ పనులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ఆంజనేయరాజు టీఏ భాస్కరరెడ్డి సతీష్ పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణతో జీవనం సాగించాలి

చిలకలూరిపేట: దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడిన వారు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణతో జీవితం కొనసాగించాలని డాక్టర్ ఆర్వీ సుబ్రమణ్యం చెప్పారు. రోష్ని సర్వింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆరా ఫౌండేషన్ సహకారంతో పట్టణంలోని గుండయ్యతోటలో హెచ్‌ఐవీ బాధితులకు ఉచిత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దురలవాట్లకు దూరంగా ఉంటూ పౌష్టికాహారం, క్రమం తప్పకుండా మందులు తీసుకోవడం ద్వారా హెచ్‌ఐవీ బాధితులు జీవన కాలాన్ని పొడిగించుకోవచ్చన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు ఆరా ఫౌండేషన్ సంస్థ సహకారం అందజేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో రోష్ని సంస్థ ప్రతినిధి జిలాని బాష, కోఆర్డినేటర్ ఏవీ రమణ, చైతన్య, వికాస్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 24 మందికి ఉద్యోగాలు



నరసరావుపేట ఈస్ట్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన జాబ్‌మేళాలో 24 మందికి ఉద్యోగాలు లభించినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు తెలిపారు. జాబ్‌మేళాకు ఫాక్స్‌కాన్, మెడ్‌ప్లస్ ఫార్మసిస్, రిలయన్స్ రిటైల్, పేటీఎం వంటి కంపెనీలు ఇంటర్వ్యూలకు హాజరైన 49 మంది అభ్యర్థులలో 24 మందిని ఎంపిక చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంప్లాయ్‌మెంట్ అధికారి రమాదేవి, స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ ఎం.వీరాంజనేయులు, ఎ.రమ్య, సీడాప్ పీఓ నాగుల్ పాల్గొన్నారు.

ఫౌండేషన్ సేవలు అభినందనీయం

ఏజీపీ జ్ఞానేశ్వరరావు

వినుకొండ: ఈపూరు మండలం కొండ్రముట్ల గ్రామంలో గల జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలో యంగ్‌స్టార్స్ హెల్పింగ్ హార్ట్స్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఏజీపీ ముప్పాళ్ల జ్ఞానేశ్వరరావు, మాజీ సర్పంచ్ గంగవరపు శ్రీనివాసరావులు పాల్గొని ఫౌండేషన్ చేస్తున్న సేవలను అభినందించారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతశిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రెసిడెంట్ పమిడిపల్లి అనిల్‌రాజ్, సభ్యులు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో చలివేంద్రం ప్రారంభం



వినుకొండ: కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ సురేష్ మాట్లాడుతూ ఎండల దృష్ట్యా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజల కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మురళి, కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలతో మూత్రపిండాల వ్యాధుల నివారణ



నరసరావుపేట: మూత్ర పిండాల వ్యాధుల నుంచి రక్షించుకునేందుకు ముందస్తు పరీక్షలు చాలా అవసరమని ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ బీవీ రంగారావు, అపోలో డయాలసిస్ క్లినిక్ మేనేజర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో అపోలో క్లినిక్స్ ఆధ్వర్యంలో మూత్రపిండాల ఆరోగ్యం, ముందస్తు గుర్తింపు ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అపోలో క్లినిక్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుధాకరరావు, వ్యాపారాభివృద్ధి మేనేజర్ మధుకిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ స్థలమేగా.. ఆక్రమిస్తే పోలా...!

- టీడీపీ నేతల అండతో ప్రభుత్వ భూమిలో పాగా!
- ప్రజా ప్రతినిధుల చొరవ..!
- అధికారుల ఉదాసీనతపై ప్రజల్లో అసహనం



యడ్లపాడు గ్రామ సచివాలయం ఎదురుగా శాశ్వత నిర్మాణం కోసం మార్కింగ్ వేసిన దృశ్యం

యడ్లపాడు: గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో టీడీపీకి చెందిన ఓ వ్యక్తి శాశ్వత కట్టడం నిర్మించేందుకు సిద్ధమైన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. అధికారిక అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలంలో నిర్మాణ పనులు మొదలు పెట్టినా... సంబంధిత అధికారులు మౌనం దాల్చడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే జరుగుతున్న ఈ ఘటనపై పంచాయతీ, రెవెన్యూ శాఖలకు చెందిన అధికారులు పట్టించుకోక పోవడంతో గ్రామస్తులే ముందుకొచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఆశ్రయించి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అప్పటి వరకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయనే అనుమానాలు ప్రజల్లో స్పష్టం అవుతుంది. వివరాల్లోకి వెళితే..

యడ్లపాడు గ్రామంలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమి సర్వేనంబర్ 361/2బిలో 18 సెంట్ల గ్రామ పంచాయతీకి కేటాయించారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో సుమారు రూ.73 లక్షలకు ఉపాధి నిధులతో అప్పటి మంత్రి విడదల రజిని ఆధ్వర్యంలో పంచాయతీ సభ్యులందరి ఆమోదంతో గ్రామ సచివాలయం, దాని పక్కనే రైతుభరోసా కేంద్రం నిర్మించారు. వీటి పక్కన పాలకేంద్రం, ఎదురుగా పంచాయతీ ఆదాయం పెంపొందించేందుకు షాపింగ్ కాంప్లెక్స్‌ల ఏర్పాటు కోసం పంచాయతీ పాలకవర్గం ప్రతిపాదనలు చేసుకున్నారు. అయితే అప్పట్లో నిధుల లేమి కారణంగా సచివాలయం, ఆర్‌బీకే వంటి కొన్ని నిర్మాణాలు చేసి ప్రారంభించారు. తాజాగా వీటి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఆక్రమణకు గ్రామానికి చెందిన టీడీపీకి చెందిన ఓ వ్యక్తి ఆక్రమణ చేసేందుకు ప్రయత్నించాడు. అక్కడి స్థలాన్ని శుభ్రం చేసి, మార్కింగ్ వేయించి, భవన నిర్మాణ మేస్త్రీని తీసుకువచ్చి శాశ్వత భవనం నిర్మాణ పనులను ప్రారంభించాడు. టీడీపీ నాయకులు అండతోనే ఆక్రమణకు తెరతీసినట్లు సర్వత్రా చర్చించుకుంటున్నారు. ప్రభుత్వ కార్యాలయం ఎదుట ఆక్రమణకు పాల్పడినా అధికారుల్లో స్పందన లేకపోవడంతో తీవ్ర విమర్శలకు తావిస్తోంది. చివరకు గ్రామంలోని ప్రజాప్రతినిధులు సైతం జిల్లా ఉన్నత స్థాయి అధికారులకు విన్నవించుకున్న తర్వాత పంచాయతీ కార్యదర్శి అక్కడకు వచ్చి నిర్మాణ పనులను నిలుపుదల చేయించారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో, సామాన్య ప్రజలు న్యాయం కోసం ఎవరిని ఆశ్రయించాలనే ప్రశ్న ఇప్పుడు యడ్లపాడు గ్రామస్తులను వేధిస్తోంది.

ఒకసారి నిలువరించా

సచివాలయ ఆవరణలో అక్రమ కట్టడానికి పనులు ప్రారంభిస్తున్నారంటూ ఆదివారం తన దృష్టికి రాగా వెంటనే వారికి ఫోన్ చేసి ఆపాలంటూ చెప్పా. రాత్రికి గ్రామంలో తాను సర్వే చేస్తున్న క్రమంలో మళ్లీ సచివాలయం స్థలంలో నిర్మాణ పనుల కోసం తవ్వకం చేస్తున్నారని తెలిసి వెళ్లి నిలుపుదల చేయించా.

– శశికళ, పంచాయతీ కార్యదర్శి

నేడు కనమర్లపూడిలో భూమి పూజ

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామ పరిధిలో జాతీయ రహదారి వెంబడి ఉన్న స్థలంలో 30 అడుగుల శ్రీమద్వి విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమం నేడు ఉదయం జరుగుతుందని విశ్వబ్రాహ్మణల సంఘం నేతలు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కనమర్లపూడి గ్రామానికి సూమారు 200 సంవత్సరాల చరిత్ర కల్గియుందని పార్టీలకు కులమతాలకు అతీతంగా ఐకమత్యంతో గ్రామ విశిష్టతతో విశ్వబ్రాహ్మణుల పాత్ర కీలకపాత్ర ఉందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం లేని రోజుల్లోని అంగి, మంగి అనే మర బొమ్మలను తయారు చేసిన నైపుణ్యం ఉపాధ్యాయ వృత్తిలో ఉండి ఎంతో మందిని విద్యావంతులుగా వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దారన్నారు. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

నూజెండ్లలో టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు

నూజెండ్ల : ఈనెల 17 నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మండల కేంద్రమైన నూజెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్ పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈవో రవిచంద్ర గురువారం తెలిపారు. మండల పరిధిలో 440 విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు రాయడానికి సంసిద్ధంగా ఉన్నారని తెలిపారు. పాతనాగిరెడ్డి, కంభంపాడు, ములకలూరు, గ్రామాలకు ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారన్నారు. ఉదయం 9.30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12.30 నిమిషాల వరకు పరీక్ష జరుగుతుంది.

పరీక్ష కేంద్రం పరిశీలన

శావల్యాపురం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలు ఈనెల 17 నుంచి 31 వరకు జరగనున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాన్ని శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ యడవల్లి శ్రీనివాసరావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య ఆధారంగా తరగతి గదులు కేటాయించామని ప్రభుత్వ నిబంధనలు మేరకు ఒక్కో గదికి 24 మంది విద్యార్థులు పరీక్షలు రాయడానికి అనుకూలంగా ఉండే గాలి వెలుతురు విద్యుత్ సౌకర్యం ఉన్న గదులను మౌలిక వసతులతో పాటు మరుగుదొడ్లు క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. స్థానిక పోలీసు స్టేషనుకు పదో తరగతి ప్రశ్నపత్రాలను భద్రపరిచే పనులను కూడా పర్యవేక్షణ చేస్తామన్నారు. పదో తరగతి పరీక్షలు సజావుగా ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.

మిరప ఆరబెట్టే విధానంలో జాగ్రత్త అవసరం

ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి.సైదానాయక్


రైతులకు సూచనలు చేస్తున్న అధికారి

బొల్లాపల్లి: మిరప కోత అనంతరం కాయలను ఆరబెట్టే విధానంలో జాగ్రత్తలు తీసుకుంటే నాణ్యత ప్రమాణాలు పెరుగుతాయని వ్యవసాయ పరిశోధన స్థానం సంగమహేశ్వరపురంకు చెందిన ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి.సైదానాయక్ తెలిపారు. మండలంలోని రావులాపురం, గుమ్మనంపాడు గ్రామాలను వినుకొండ ఉద్యానశాఖ అధికారి షేక్ నబీ రసూల్‌తో కలసి మిరప పొలాలను, ఎండ బెట్టిన మిరప కాయల కల్లాలను పరిశీలించి రైతులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ మిరప కోత అనంతరం సిల్పాలిన్, తార్పాలిన్ పట్టలతో ఎండలో ఆరబెట్టాలని, రాత్రి వేళ మంచు పడకుండా కాయలపై పట్టలు కప్పాలని సూచించారు. నాణ్యతపెరిగి మార్కెట్‌లో గిరాకీ ఉంటుందన్నారు. మిరప పంటను ఆశించు తెల్లనల్లి, తెల్లదోమ, తామర పురుగు, వైరస్ తెగులు వాటికి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. మిరప పంటను ఆశించు తెగుళ్లకు సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

వెంటనే జీతాలు చెల్లించాలి

చిలకలూరిపేట: విద్యుత్ కాంట్రాక్టు కార్మికులకు ఈ నెలలో ఇప్పటి వరకు జీతాలు చెల్లించకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులకు గురౌతున్నారని, వెంటనే జీతాలు చెల్లించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జల్లెడ రాజశేఖర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులు చాలీచాలని జీతాలతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, 13వ తేదీ వచ్చినా జీతాలు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. సకాలంలో జీతాలు అందకపోవడంతో ఇంటి అవసరాలతో పాటు రుణాల తాలుకూ ఈఎంఐలు చెల్లించే పరిస్థితి లేక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెలా ఒకటో తారీఖున జీతాలు చెల్లిస్తామని ప్రభుత్వం ఇచ్చినప్పటికీ కాంట్రాక్టు కార్మికులకు చెల్లించటం లేదన్నారు. సకాలంలో జీతాలు చెల్లించటంతో పాటు ఈపీఎఫ్, ఈఎస్ఐ బకాయిలు కూడా తక్షణమే చెల్లించాలని, లేని పక్షంలో ఆందోళన బాట చేపడతామని హెచ్చరించారు.

త్రిదశల సంగమమే కారుణ్య వసంతం

- మొదటి దశ ఉపవాసాలు పూర్తి
- ఇప్పటికే ప్రారంభమైన రెండోదశ రోజాలు
- కఠిన దీక్షలతో మానవ పరివర్తన
- ఆత్మ, దేహం అల్లాహ్ కోసం అంకితం


దువా చేస్తున్న ముస్లిం మహిళలు

యడ్లపాడు: ఇస్లాం మతంలోని అత్యంత పవిత్రమైన మాసమైన రంజాన్ 29 లేదా 30 రోజుల పాటు కొనసాగుతుంది. సంక్షేమం, శాంతి, భక్తి పరవశంతో నిండిన రంజాన్ మాసం ముస్లింల కోసం దైవ అనుగ్రహానికి ద్వారం లాంటిది. ఈ నెలలో ముస్లింలు కఠిన దీక్ష పాటిస్తూ, కేవలం ఆహారాన్ని త్యజించడం మాత్రమే కాదు, హృదయాన్ని శుద్ధి, ఆత్మవిశ్లేషణ చేసుకోవడం, సమాజానికి మేలుచేసే మార్గాన్ని ఎంచుకోవడం వంటి కార్యాలతో తమ జీవితాన్ని పరిశుభ్ర పరుస్తారు.

మూడు దశల పవిత్ర ప్రయాణం

ఉపవాస దీక్ష (రోజా) పాటించే ఈ మాసాన్ని మత పెద్దలు మూడు దశలుగా విభజించి, ఆధ్యాత్మిక పరంగా మరింత లోతుగా అనుసరిస్తారు. అవి దయ, క్షమాపణ, విమోచనం రూపంలో ఒక్కొక్క దశ ఒక్కో పవిత్రమైన సందేశాన్ని మోసుకొస్తుంది. ప్రతి దశకు ప్రత్యేకమైన ఆధ్యాత్మిక అర్థం, అంతరార్థం ఉంటుంది. 'రహమత్ కా అష్ర' (అల్లాహ్ కరుణకు అంకితమైన మొదటి 10 రోజులు), 'మగ్ఫిరత్ కా అష్ర' (పాపాల నుంచి క్షమాభిక్ష పొందే రెండో 10 రోజులు), 'జహన్నం సే నజాత్ కా అష్ర'(నరకం నుంచి విముక్తి కోసం ప్రార్థించే చివరి 10 రోజులు) మంగళవారంతో మొదటి దశ పూర్తయి, బుధవారం నుంచి రెండో దశ ప్రారంభమైంది.

1. రహమత్ అష్ర (కారుణ్య దినాలు)

రంజాన్ మొదటి పది దినాలు 'రహమత్ కా అష్ర'గా పిలవబడతాయి. అల్లాహ్ అపారమైన దయ, కరుణ రూపంలో తన అనుగ్రహాన్ని ప్రసాదిస్తాడని విశ్వసిస్తారు. దురాచారాలను విడచి, సత్కార్యాలను అలవాటు చేసుకోవాలని మత పెద్దలు సూచిస్తారు. భక్తులు తమ హృదయాలను కరుణతో వెలిగించుకుని, సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు.

2. మగ్ఫిరత్ అష్ర (క్షమాభిక్ష దినాలు)

ఇది పాప విమోచన దశ. గతంలో చేసిన తప్పిదాలకు అల్లాహ్ క్షమాపణ కోరే సమయమే మన్నింపు దశగా పరిగణిస్తారు. ఈ సమయంలో చేసిన ప్రతి మంచిపనికి 70 రెట్లు ఫలితం దక్కుతుందనే విశ్వాసం ఉంది. భక్తులు ఆత్మపరిశీలన చేసుకుంటారు. ఇతరులకు సహాయం, అన్నదానం చేయడం, పేదలకు తోడుగా నిలవడం వంటి పనులు ఎక్కువగా చేస్తూ ప్రాయశ్చిత్తం చేసుకుంటారు.

3. జహన్నమ్ సే ఫనాహ్ మాంగ్‌నే కా అష్ర (నరకవిముక్తి దినాలు)

చివరిది నరకం నుంచి విమోచన. ఇది నరక భయాన్ని తొలగించుకునేందుకు భక్తులు తమ మనసును, ఆలోచనలను పూర్తిగా అల్లాకు అంకితం చేస్తారు. ఎతికాఫ్ అనే ప్రత్యేక ఆచారం పాటిస్తూ, మసీదుల్లోనే గడుపుతూ నిరంతర ప్రార్థనలు చేస్తారు. కుటుంబ బంధాలను, భౌతిక ప్రపంచాన్ని తాత్కాలికంగా విడిచి, పరమాత్మ పరాయణంగా మిగిలిపోతారు. పరలోకంలో శాశ్వత శాంతిని పొందేందుకు, అల్లాహ్ చిత్తాన్ని అనుసరించేందుకు ఈ దశ అత్యంత కీలకమైనదిగా భావిస్తారు. ఇందులోని పవిత్ర రాత్రులలో లైలతుల్ ఖదర్ (అదృష్ట రాత్రి) ప్రత్యేకమైనది. ఈ రోజుల్లో ముస్లింలు శుద్ధ హృదయంతో ఆచరణ చేయడం ద్వారా స్వర్గాన్ని పొందాలని ప్రార్థిస్తారు.

వినియోగదారులకు సకాలంలో సేవలు అందించాలి


సమస్యలు తెలుసుకుంటున్న విక్టర్ ఇమ్మానియేల్

చిలకలూరిపేట: విద్యుత్ వినియోగదారులకు సకాలంలో సేవలు అందించేందుకు విద్యుత్ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని విశ్రాంత జిల్లా న్యాయమూర్తి ఎస్ విక్టర్ ఇమ్మానియేల్ చెప్పారు. పట్టణంలోని సుబ్బయ్యతోటలో ఉన్న విద్యుత్ ఉప కేంద్రంలో గురువారం విద్యుత్ వినియోగదారుల అదాలత్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యుత్ అదాలత్ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి విక్టర్ ఇమ్మానియేల్ మాట్లాడుతూ ఏ సమస్యనైనా 30 రోజుల లోపు పరిష్కరించాలని సూచించారు. వినియోగదారులకు ఏదైనా సమస్య పరిష్కారం కాకుంటే విజయవాడలో ఉన్న విద్యుత్ సమస్యల పరిష్కారవేదిక కార్యాలయంలో నేరుగా అర్జీ పెట్టుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా 10 మంది వినియోగదారులకు సంబంధించి సమస్యలు అర్జీలు స్వీకరించారు. కొన్నింటిని వెంటనే పరిష్కరించి, మిగిలినవి నెల రోజుల లోపు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఆర్డీఏ సర్కిల్ సూపరింటెండెంట్ పి.సుబ్రమణ్యం, అదాలత్ సభ్యులు కె వెంకటకృష్ణ, ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, ఎ.సునీత, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

17న సాతులూరులో రెడ్డిపేరంటాలమ్మ ఆలయ ప్రతిష్ట


సాతులూరులో ప్రతిష్టకు సిద్ధమైన రెడ్డిపేరంటాలమ్మ ఆలయం

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో కొలువైయున్న చారిత్రాత్మక రెడ్డిపేరంటాలమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ నెల 17 ఉదయం 10.41 గంటలకు ప్రతిష్ట మహోత్సవం జరగనుంది. మూడు రోజుల పాటూ ప్రతిష్ట కార్యక్రమాలు జరగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 15వ తేదీ శనివారం మంగళ వాయిద్యాలతో మంగళ తోరణాలు, 16న ఉదయం సుప్రభాత సేవ, 17న ఉపనిషత్ పారాయణం, ప్రతిష్ట జరగనుంది. పలువురు దంపతులతో ఆలయ ఆవరణలో మహాగణపతి పూజ, పుణ్యావాచనం, భారీ అన్నదానం జరగనుంది.

గోకులం షెడ్ల బిల్లులు త్వరితగతిన మంజూరు చేస్తాం

జిల్లా ఉపాధి పీడీ మఠం సిద్ధాలింగమూర్తి


రికార్డులు పరిశీలిస్తున్న పీడీ సిద్ధాలింగమూర్తి

శావల్యాపురం: గోకులం షెడ్లు బిల్లులు త్వరితగతిన ప్రభుత్వం మంజూరు చేస్తుందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టరు మఠం సిద్ధాలింగమూర్తి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పనులు, పంట కుంటలు, నీటి కుంటలు పనుల పురోగతిపై ఉపాధి సిబ్బంది సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధి పీడీ సిద్ధాలింగమూర్తి మాట్లాడుతూ జిల్లాలో గోకుల షెడ్లు 714 మంజూరు కాగా 673 పూర్తి అయినట్లు తెలిపారు. జిల్లాలో ఉపాధి కూలీలు రోజుకు 50 వేల మంది చేయాల్సి ఉండగా రోజుకు 15 వేలు పనులు చేస్తున్నట్లు తెలిపారు.ఇంకుడు గుంతలు 4203 మంజూరు కాగా ఇప్పటి 1056 పూర్తి అయినట్లు తెలిపారు. పంట కుంటలు 2392 మంజూరు కాగా 619 తుది దశకు చేరినట్లు తెలిపారు. జనవరి 15 వరకు ఉపాధి కూలీలకు పెండింగ్ వేతనాలు వారం రోజుల వ్యవధిలో బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయన్నారు. ఈశ్రమ కార్డులు నూరు శాతం అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఉపాధి రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఆయనతో పాటు ఏపీవో కె.రామారావు, టీఏ రోజా, ఫీల్డ్ అసిస్టెంట్స్ చెరుకూరి బాలకృష్ణ ఉన్నారు.

యజమానుల చేతికి విలువైన సెల్‌ఫోన్లు

దొంగలపాలై.. జారవిడుచుకున్న సెల్‌ఫోన్లు రికవరీ చేసిన పోలీసులు



జిల్లా పోలీసు కార్యాలయంలో తిరిగి పొందిన సెల్‌ఫోన్లతో వాటి యజమానులు

నరసరావుపేట: జిల్లాలో దొంగిలించబడిన, పోగొట్టుకున్న సుమారు రూ.31.22 లక్షల విలువైన 223 సెల్‌ఫోన్లను రికవరీ చేసిన పల్నాడు జిల్లా పోలీసులు వాటి యజమానులకు అందజేశారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు యజమానులకు వారి సెల్‌ఫోన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సమాచార చేరవేతకు, వినోదానికి, విజ్ఞాన సమూపార్జన కోసం మొబైల్ ఫోన్లు ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. చాలా సందర్భాల్లో ప్రజలు తమ సెల్‌ఫోన్లను పోగొట్టుకోవడం లేదా దొంగలింపబడటం వలన చాలా ఇబ్బందులను ఎదుర్కొంటూ ఏమి చేయాలో దిక్కు తోచలేని పరిస్థితుల్లో పోలీసు వారిని ఆశ్రయిస్తున్నారన్నారు. తమ పోలీసులు పోయిన సెల్‌ఫోన్ల వివరాలను రాబట్టి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వాటిని వెతికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేకుండా బాధితులకు అందజేస్తున్నారన్నారు. ఎవరైనా ప్రజలు తమ మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగతనానికి గురైతే వెంటనే సీఇఐఆర్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. పోయిన సెల్‌ఫోన్లు తమకు అందినందుకు వాటి యజమానులు సంతోషం వ్యక్తం చేశారు. పరిపాలన విభాగ అదనపు ఎస్పీ జేవీ సంతోష్, నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల డీఎస్పీలు నాగేశ్వరరావు ఎం.హనుమంతరావు. జగదీష్, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ వెంకట రమణ పాల్గొన్నారు.

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయండి

విద్యాదాత, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి


చిరుమామిళ్ళ జెడ్పీ హైస్కూలులో పదోతరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులతో విద్యాదాత నడికట్టు రామిరెడ్డి

నాదెండ్ల: పదో తరగతి ప్రతి విద్యార్థి జీవితంలో మైలురాయి వంటిదని, విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని విద్యాదాత, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి చెప్పారు. చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో పరీక్షల సన్నద్ధతపై మాట్లాడారు. ప్రణాళిక ప్రకారం చదువుకుని పరీక్షలకు హాజరుకావాలన్నారు. పౌష్టికాహారం, సరైన నిద్రతో మెదడుపై ఎలాంటి ఒత్తిడి ఉండదని, దీంతో చదివిన అంశాలు చక్కగా గుర్తుండి పరీక్షలు రాయొచ్చన్నారు. గతేడాది పాఠశాలలో నూరుశాతం ఫలితాలు సాధించి జిల్లాలోనే పాఠశాల ప్రథమస్థానంలో నిలవటం గర్వకారణమన్నారు. ఈ ఏడాది పరీక్షలు రాయనున్న 70 మంది విద్యార్థులు నూరుశాతం ఫలితాలతో సత్తాచాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుందరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వడ్డెంగుంటలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు


పార్టీ ఆవిర్భావ వేడుకల్లో మాట్లాడుతున్న సీనియర్ నాయకులు

బొల్లాపల్లి : వైఎస్సార్ సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలోని వడ్డెంగుంట గ్రామంలో బుధవారం రాత్రి నిర్వహించారు. గ్రామ పార్టీ అధ్యక్షులు గాలం గోవిందరాజులు ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలు జరిగాయి. ఆవిర్భావ వేడుకల సందర్భంగా గ్రామానికి చెందిన రెండు కుటుంబాలు తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పార్టీ గ్రామ అధ్యక్షుడు కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కొల్లి ఆంజనేయులు, పెమ్మసాని ధర్మాంజనేయులు ఇరువురు కూటమి ప్రభుత్వ పాలన పట్ల విరక్తితో వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ముంద్రు వెంకటేశ్వర్లు, నెల్లూరి నాగేశ్వరరావు, రాగా చంద్రయ్య, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మొల్లమాంబకు నివాళి

- మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జీవోతోనే కలెక్టర్ కార్యాలయంలో వేడుకలు
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి


మొల్లమాంబ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: రామాయణాన్ని తెలుగులోకి అనువదించిన కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతి ఉత్సవాలను స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గురువారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ రామాయణమును తెలుగులో అనువదించడం జరిగిందని అన్నారు. ఈ రామాయణం మొల్ల రామాయణంగా ప్రఖ్యాతి చెందిందని అన్నారు.

ఆమెకు తగురీతిన గౌరవం కల్పించాలనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈమె జయంతి ఉత్సవాలను ప్రతి కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వపరంగా నిర్వహించాలని ఒక జీవో తీసుకుని వచ్చారన్నారు. అందుకు కృతజ్ఞతగా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జయంతి ఉత్సవాల నిర్వహించుకోవటం జరిగిందన్నారు. పార్టీ ట్రేడ్ యూనియన్ నాయకులు వేముల శివ, రాజారపు శ్రీనివాసరావు, గుమ్మడిదల శివకుమార్, కందుకూరి అశోక్, బెజ్జంకి శ్రీనివాసులు, బండి రత్తయ్య పాల్గొన్నారు.

ఎండీయూ వాహనం తనిఖీ చేసిన జేసీ

నరసరావుపేట: చౌక ధరల దుకాణం ద్వారా బియ్యం పంపిణీ ఏ విధంగా నడుస్తున్నది అన్నదానిపై జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. నరసరావుపేటలో పంపిణీ చేస్తున్న ఎం.యు.డి బియ్యం పంపిణీ వాహనాన్ని పరిశీలించారు. స్టాక్ వివరాలు ఆపరేటర్‌ను అడిగి తెలుసుకొని, ఆ సమయంలో బియ్యం తీసుకునేందుకు వచ్చిన లబ్ధిదారులతో మాట్లాడారు. ఆర్డీవో కె.మధులత, తహసీల్దార్ పాల్గొన్నారు.